www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024

5 తూర్పుగోదావరి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, రెవెన్యూ డివిజనల్, మున్సిపల్, మండల స్థాయిలో 'మీ కోసం' కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, వారి అర్జీను క్షేత్ర స్థాయిలో స్థానికంగా అందుబాటులో ఉండే డివిజనల్, మునిసిపల్, మండల స్థాయి అధికారులకి అందచేయాలని సూచించారు. అర్జీదారులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కలెక్టరేట్ వద్దకు రావద్దని సూచించారు. సోమవారం కార్యాలయాల్లో అధికారులు ఒకే చోట అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరించాలన్నారు.

నిర్మాణ రంగంపై ధరాభారం

- నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి
- చిన్న ఇళ్లకు రూ.5 లక్షల వరకూ అదనం
- ఆందోళన చెందుతున్న సామాన్యులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

భవన నిర్మాణ రంగంలో నిర్మాణ సామగ్రి ధరల పెంపు పెనుభారంగా మారింది. గతంలో ఇనుము ధరలు పెరిగిన విషయం విదితమే. తాజాగా సిమెంట్ ధరలూ పెరిగాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత నేపథ్యంలో భవన నిర్మాణ రంగం పూర్తిగా కుదేలయ్యింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామనడంతో ఈ రంగానికి అనుబంధమైన 26 రంగాల కార్మికులలో ఆశలు చిగురించాయి. ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆశలు ఒకొక్కటిగా ఆవిరౌతున్నాయి. ఉచిత ఇసుక మేడిపండు చందంగా మారడంతో ఇసుక కొరత వేధిస్తూనే ఉంది. మరోవైపు నిర్మాణ సామగ్రి ధరలూ పెరగడం గోరు చుట్టుపై రోకలి పోటులా మారుతోంది. తాజాగా పెరిగిన ధరల వల్ల ఆరు నెలల క్రితంతో పోలిస్తే సింగిల్ బెడ్ రూమ్ ఇంటికి రూ.3 నుంచి రూ.4 లక్షల అదనపు భారం పెరిగిందని చెబుతున్నారు.

సిమెంట్ బస్తాపై రూ.80 వరకూ పెంపు

ప్రముఖ బ్రాండెడ్ సిమెంట్ కంపెనీలు రెండు మూడు రోజులకు ఒకసారి ధరలు పెంచుతున్నాయి. కంపెనీల సేల్స్ మేనేజర్లు ధరలు పెరుగుతున్నట్లు నాలుగైదు రోజు ముందే మెసేజ్ పెట్టి.. ఆరోజు ధరలకే డిడిలు తీయమంటూ ఆదేశాలు ఇస్తున్నారు. ధర పెరుగుతుందని వడ్డీలకు అప్పులు చేసి డీలర్లు ఆర్డర్లు బుక్ చేస్తున్నట్లు ఒక వ్యాపారి తెలిపారు. ఈ వారం రోజుల్లో ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలు మూడుసార్లు ధర పెంచారు. ఈ లెక్కన బస్తాపై రూ.70 వరకు పెరిగింది. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టుకోవాలంటే 950 బస్తాలకు పైగా సిమెంట్ అవసరమని ఒక బిల్డర్ తెలిపారు. సొంతంగా ఇల్లు కట్టుకుంటే వెయ్యి బస్తాలకు పైగా అవసరం. ఈ లెక్కన కొత్త ఇల్లు కట్టుకునేవారికి వారం రోజుల్లోనే రూ.65 వేల నుంచి రూ.70 వేలు సిమెంట్ రూపంలో అదనపు భారం తప్పడం లేదు.

స్టీల్ ధరలూ అదే బాట

ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే స్టీల్, ఇతర సామగ్రి ధరలు క్రమ క్రమంగా పెరిగాయి. ప్రముఖ కంపెనీల గ్రేడ్-1 రకం స్టీల్ టన్ను గతేడాది రూ.73 వేలు కాగా రూ.78 వేలకు చేరింది. ఈ లెక్కన టన్నుపై రూ.5 వేలు పెరిగింది. సాధారణ కంపెనీలకు చెందిన గ్రేడ్-2 రకం స్టీల్ రూ.56 వేల నుంచి రూ.61 వేలకు చేరింది. టన్నుపై రూ.5 వేలు పెరిగింది. డబుల్ బెడ్‌రూం ఇంటికి 2.5 నుంచి 3 టన్నులు అవసరమని ఇంజనీర్లు అంటున్నారు. ఈ లెక్కన పెరిగిన ధరలతో పోలిస్తే రూ.15 వేలకు పైగా భారం తప్పడం లేదు. గతంలో ఇంటి నిర్మాణ ఇటుక రూ.6 ఉంటే తాజాగా నాణ్యతను బట్టి రూ.8-10 పైమాటే. భవన నిర్మాణాలకు కావాల్సిన చెక్క సామాగ్రి, ఎలక్ట్రికల్, పెయింట్స్ (రంగులు), టైల్స్, గ్రానైట్ బండలు.. ఇలా అన్ని రకాల సామాగ్రి ధరలు పెరిగాయని బిల్డర్లు అంటున్నారు.

ధరల పెంపును నియంత్రించాలి

భవన నిర్మాణ రంగం ధరల పెరుగుదల గోరుచుట్టుపై రోకలి పోటులా మారుతోంది. ఇప్పటికే స్టీల్, సిమెంట్ ధరల పెంపుతో వ్యాపారాలు సగానికిపైగా పడిపోయాయి. ప్రముఖ కంపెనీల గ్రేడ్-1 స్టీల్ టన్ను రూ.73 వేల నుంచి రూ.78 వేలకు, విశాఖ స్టీల్ రూ.65 వేల నుంచి రూ.71 వేలకు పెరిగింది. సిమెంట్ బస్తా రూ.50 నుంచి రూ.70 చొప్పున పెరిగింది. ధరల నియంత్రణకు చొరవ చూపాలి

- కె.రమేష్ బాబు, బిల్డర్, రాజమహేంద్రవరం

ధరల పెరుగుదలతో అంచానాలు మార్పు

సొంత ఇల్లు కట్టుకోవాలని రూ.35 లక్షల అంచనాతో ఇంటి నిర్మాణం గతేడాది ప్రారంభించాను. కొంతకాలం ఇసుక కొరత వేధించింది. స్లాబ్ దశకు చేరుకునేసరికి సిమెంట్ ధరలు అమాంతంగా పెరిగాయి. స్టీల్ ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా ఇంటి నిర్మాణ వ్యయం అంచనా తారుమారైంది. ప్రస్తుత పరిస్థితుల్లో బయట ఎక్కడా అప్పు కూడా పుట్టడం లేదు.

- సిహెచ్.రామరాజు, రాజమహేంద్రవరం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

16 నుంచి అందుబాటులో ఉచిత ఇసుక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసిన వినియోగదారులందరికీ ఈ నెల 16వ తేదీ నుంచి ఇసుక అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇసుక లభ్యతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో తొమ్మిది డిసిల్టేషన్ పాయింట్స్‌లో బోట్స్ మ్యాన్ సొసైటీల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తామన్నారు. పెండ్యాల, పందలపర్రు ర్యాంపులో 34 వేల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు జిల్లాలకు ఇసుక లభ్యతను బట్టి సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోమవారం నుంచి వారం రోజుల కోసం 65 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

ప్రతి రోజూ సగటున మెట్రిక్ 13 వేల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఇన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వినియోగదారుల కోసం సిద్ధంగా ఉందన్నారు. సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖాతాలకు జమ చేయడం లేదని తెలిపారు. ఇసుక ఉచితంగా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని వచ్చిందని తెలిపారు. వినియోగదారులు తవ్వకాలు, పరిపాలన ఖర్చులు మాత్రమే చెల్లించాలని, తద్వారా బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులకు ఇసుక తవ్వకాల విషయంలో ఆదాయం సమకూరుతుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం ద్వారా తగిన వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రవాణా ఛార్జీల మేరకు వాహనదారులు ఎన్‌ప్యానల్మెంట్ అయ్యారన్నారు. బోట్స్‌మ్యాన్ సొసైటీలకు కేవలం తవ్వకం, పరిపాలన పరమైన వ్యయం ఛార్జీలు మాత్రమే చెల్లించాలన్నారు. మెట్రిక్ టన్నుకు రూ.345 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సరఫరా ఖర్చులను గతంలో ఉన్న రూ.420 నుంచి ప్రస్తుతం రూ.345కు తగ్గించినట్టు తెలిపారు. ఓపెన్ స్టాక్ యార్డ్ పాయింట్స్ అందుబాటులోకి రావడం వల్ల త్వరలో మరింత తగ్గించి ధరను రూ.215కు అందుబాటులోకి రానుంది. మరిన్ని డిసిల్టేషన్ పాయింట్స్ అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియ చేపడతామన్నారు. ప్రస్తుతం 48 బోట్స్ మ్యాన్ సొసైటీలకు అనుమతి ఇచ్చామని, రానున్న రోజుల్లో అర్హత మేరకు మరికొన్ని సొసైటీలకు ప్రామాణాల మేరకు అనుమతులు జారీ చేస్తామన్నారు.

17 ఓపెన్ స్టాక్ పాయింట్స్‌కు టెండర్ల ఇసుక సరఫరా ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వ్యక్తిగత, బల్క్ ఆర్డర్స్ 24 గంటల నుంచి 48 గంటల్లోపు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన 48 గంటల వ్యవధిలోనే వినియోగదారులకు ఇసుకను అందజేస్తున్నామన్నారు. ప్రతి వాహనానికీ జియో టాగింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్‌జిటి మార్గదర్శకాల మేరకు బోట్స్ మాన్ సొసైటీస్ డీసిల్టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు అనుమతులు జారీ, అందుకు అనుగుణంగా రీచ్‌లో ప్రారంభం కానున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పెనాల్టీ రుసుముగా రూ.24 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆన్‌లైన్ వినియోగదారులకు 13 వేల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఫణి భూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

8న పశువులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చాగల్లు

ఈ నెల 8న ఉదయం 08.30 గంటల నుంచి చాగల్లు గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా పశువైద్యశాల, చాగల్లు వద్ద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు పశు వైద్య శాఖ అధికారి యు.ముకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువులకు వివిధ శస్త్ర చికిత్సలు, గర్భకోశ వ్యాధుల చికిత్స, లేగ దూడలకు నట్టల నివారణ, బాహ్య పరాన్న జీవుల నిర్మూలన, వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులు ఈ ఉచిత వైద్య శిబిరం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నూతన వస్త్రాలు అందజేస్తున్న చక్రవర్తి దంపతులు

ఘనంగా చక్రవర్తి పుట్టిన రోజు

ప్రజాశక్తి-కడియం

వృద్ధులు, చిన్నారు మధ్య పుట్టినరోజు జరుపుకోవడం ఆనందంగా ఉందని, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ నర్సరీ అధినేత తాడాల విష్ణు చక్రవర్తి సంతోషం వ్యక్తం చేశారు. బొమ్మూరు లెప్రర్సీ కాలనీ వివేకానంద మహా ఆరోగ్య కేంద్రంలో వృద్ధులు, మహిళలకు, రోగులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, పలురకాలు పండ్లు, ఆహార పొట్లాలను విష్ణు చక్రవర్తి దంపతులు అందజేశారు. ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం, కొవ్వూరు వృద్ధాశ్రమంలో నూతన వస్త్రాలతో పాటు, దుప్పట్లు ఆహార పొట్లాలను అందజేశారు. కడియం మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులకు అల్పాహారం, విందు భోజనం అందించారు. రాబోయే రోజుల్లో టివిసి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సహాయం అందుకున్న వందలాది మంది చక్రవర్తి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో చక్రవర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి-కొవ్వూరు

కొవ్వూరు డివిజన్ పరిధిలో 126 ఆర్ఎస్‌కెలలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు జెసి ఎస్.చిన్న రాముడు తెలిపారు. ఆదివారం ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవంలో భాగంగా రైతులతో, రైస్ మిల్లర్స్‌తో ఆర్‌డిఒ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ప్రస్తుత 2024-25 ఖరీఫ్ సీజన్లో వరి దిగుబడి గణనీయంగా వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. అందుకు అనుబంధంగా జిల్లాల్లోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు గత సీజన్లో ఎదుర్కొన్న సమస్యలపై మిల్లర్స్‌తో కలిసి చర్చించి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. రైతులు, మిల్లర్ల యాజమాన్యం, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో సమర్థవంతంగా నిర్వహించేందుకు రైతులు, మిల్లర్ల యాజమాన్యం, వ్యవసాయ అధికారులు సమన్వయంతో సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండిస్తారన్నారు. వీటిలో సన్నబియ్యం ఎగుమతి చేయగా 2.5 లక్షలు మెట్రిక్ టన్నులు ఈ ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తామన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించుకునేందుకు సమన్వయ శాఖల అధికారులతో, మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.రాధిక మాట్లాడుతూ ఈ సంవత్సరం రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపవచ్చునని తెలిపారు. డిఎస్ఒ ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులుకు అవసరమైన గోనె సంచులు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఎస్‌కెల వారీగా పంట దిగుబడి అంచనా వేసి అందుకు అనుగుణంగా రైతులకు గోనె సంచులను సకాలంలో అందిస్తామని తెలిపారు. ఆర్‌డిఒ డాక్టర్ రాణి సుస్మిత మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలులో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎఇ పి.చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-నల్లజర్ల

తెలికిచర్లలో అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న కుంచే సత్యనారాయణ కుటుంబానికి గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సిఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. ఆదివారం నల్లజర్లలో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఆ కుటుంబానికి తెలికిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.32,500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకాల అంజి, వీరమళ్ల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

పలువురికి పెందుర్తి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పెందుర్తి అభిరామ్ ఆదివారం పరామర్శించారు. వంగలపూడిలో గద్దే వెంకట రమణ (చోడియ్య) తల్లి, దుద్దుపూడి సత్యనారాయణ తల్లి మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

న్యాయం చేయాలని డ్వాక్రా సభ్యుల వినతి

ప్రజాశక్తి-కడియం

కడియపులంక గ్రామ పంచాయితీ పరిధిలో డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాల చెల్లింపులో రూ.లక్షల్లో అక్రమాలు జరిగాయని సంఘ సభ్యులు రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి విన్నవించారు. కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎల్ఎను కలిసి వినతిపత్రం అందించారు. సుమారు రూ.10 లక్షల వరకు మోసం జరిగిందని, ఇంకా ఇతర గ్రూపులలో కూడా మోసాలు జరిగాయని తెలిపారు. ఈ విషయం అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఎటువంటి స్పందనా లేదని తెలిపారు. దీనిపై ఎంఎల్ఎ గోరంట్ల స్పందించి అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుంటామని, తప్పకుండా న్యాయం చేస్తానని మహిళలకు హామీ ఇచ్చారు.

ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా మహిళలు

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు అభిరామ్

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్రస్థాయి యు-17 హ్యాండ్ బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.అభిరామ్ ఎంపికైనట్లు పాఠశాల పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ గత నెల 30న ఏలూరులో జరిగిన యు-17 జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుండి 9 తేదీ వరకు రాజమండ్రిలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ఆమెతెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వీర్రాజు, ఎస్ఎంఎస్ చైర్మన్ కె.గోపాలకృష్ణ, పాఠశాల పీడీ జె.విజయలక్ష్మి, పిఇటిలు ప్రేమ్‌చంద్, బి.చంద్రలను విద్యార్థి అభిరామ్‌ను అభినందించారు.

ఇన్‌ఛార్జిని మార్చేందుకు టిడిపి కసరత్తు..?

ప్రజాశక్తి - సీతానగరం

సార్వత్రిక ఎన్నికల అనంతరం రాజానగరం నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిని మార్చే యోచనలో టిడిపి అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా రాజానగరం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ పోటీ చేసి గెలుపొందారు. దీంతో టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గీయులు రాజానగరం రాయల్ కన్వెన్షన్ హాల్లో ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురంధేశ్వరి పరిచయ కార్యక్రమంలో ఫ్లెక్సీల వివాదంలో బొడ్డు వర్గం నానా గందరగోళం సృష్టించారు. అనంతరం రాజమండ్రిలో ఎన్నికల శంఖారావం సభలో వెంకట రమణ చౌదరికి ఎంఎల్ఎ సీటు కేటాయించాలని కోరుతూ ఆందోళన చేస్తు టిడిపి అధినేత చంద్రబాబు మీదకు దూసుకు వెళ్ళడంతో అధినేత చంద్రబాబు నాయుడుకు స్వల్ప ప్రమాదం జరిగింది. అప్పటి నుండి టిడిపి అధినేత చంద్రబాబు బొడ్డు వెంకట రమణ చౌదరి తీరుపై అసహనంగా ఉన్నట్లు టిడిపిలో చర్చ జరుగుతోంది. అక్టోబర్ నెలలో రాజమండ్రిలో నెలకొల్పిన ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి రాజమండ్రి ఎయిర్పోర్ట్ లో దిగి బ్లడ్ బ్యాంక్‌కు రోడ్డు మార్గంలో ప్రయాణించారు. ఆ కార్యక్రమానికి వెంకట రమణ చౌదరి వెళ్ళకుండా గైర్హాజరయ్యారు. రాజానగరం టిడిపి ఇన్చార్జిగా ఉన్నప్పటికీ, అటు ఎంఎల్ఎ సీటు, ఇటు నామినేటెడ్ పదవి ఇవ్వలేదని అధిష్టానం మీద కోపంతో నియోజకవర్గంలో కేడర్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఆదేశాలు ఇచ్చారని చర్చించుకుంటున్నారు. ఇటీవల జరిగిన పలు కార్యక్రమాలకు హాజరు కాకపోవడంపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. వెంకట రమణ చౌదరి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్చే యోచనలో టిడిపి అధిష్టానం ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఇటీవల ఎన్నికల్లో వైసిపి ఓటమికి ప్రధాన కారణం కార్యకర్తలకు సరైన గుర్తింపు దక్కకపోవడమేనని చర్చ కూడా నడిచింది. ఈ నేపథ్యంలో అటువంటి ఇబ్బంది టిడిపిలో రాకుండా చర్యలు తీసుకునేందుకు చంద్రబాబు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు పలువురు ఇన్‌ఛార్జిలను మార్చాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దసరా తరువాత ముఖ్యనేతలతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

కార్టూ'నిజం'



గోతులమయంగా ఆర్ అండ్ బి రోడ్డు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని నిడదవోలు-నరసాపురం మెయిన్ రోడ్ పెరవలి, కాకరపర్రు, తీపర్రు, ఉసులుమర్రు, కానూరు గ్రామాల మధ్య భారీ వర్షాలకు మెయిన్ రోడ్ అడుగడుగున గోతులమయం అయ్యింది. రోడ్డు వెడల్పు చేసి రోడ్డు వేసినా భారీ గోతులు ఏర్పడి వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పడిన గోతులు వర్షానికి నిండి వాహనదారులకు రోడ్డు గొయ్య తెలియక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎండ కాస్తే కానూరు నుండి తీపర్రు వరకు దుమ్ము ధూళి ఎగసపడి రోడ్డు కనపడని దుస్థితి నెలకొంది. నిత్యం వందల సంఖ్యలో మెటల్, ఇసుక లారీలు రోడ్డుపై వెళ్లడంతో రోడ్డు వేసిన మూడు నెలలకే పాడైపోయి గోతులుగా మారడంతో పలు ఇబ్బందులు చవి చూస్తున్నారు. నానాటికీ నాణ్యత కనుమరుగై నాసిరకం మెటీరియల్‌తో రోడ్లు వేయడంతో ఇటు ప్రజలు, అటు ప్రయాణికులు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు అంటున్నారు. పదేపదే ప్యాచ్ వర్క్ చేస్తూ కంటి తుడుపుగా రోడ్డు మరమ్మతులు గాలికి వదిలేయడంతో ప్రయాణికులకు నరకప్రాయంగా ఉందంటున్నారు. ఉదయం సాయంత్రం సమయంలో విద్యార్థులు వాహనదారులు ప్రయాణికులు రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు, గర్భిణులు వైద్యం నిమిత్తం నిడదవోలు తణుకు పట్టణాలకు రోడ్డుపై వెళ్లడానికి భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేసి ప్రజలు వాహనదారులు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోతులు పడిన నిడదవోలు-నరసాపురం మెయిన్ రోడ్

నేరాలు ఘోరాలు

తమ్ముడిని హత్య చేసిన అన్న
-ఆస్తి తగాదాలే కారణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరంలో ఆస్తి తగాదాలతో తమ్ముడిపై దాడి చేసి అన్న హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామంలో పల్లిగారి వెళ్లే దారిలో ఉన్న గుండం వద్ద నివాసముంటున్న అన్నదమ్ముల వెంటపల్లి ఏడుకొండలు, నూకరాజుల మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కొబ్బరి తోటలో కాయలు తీయించే విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రేకుడైన అన్న ఏడుకొండలు తమ్ముడు నూకరాజును కత్తితో విచక్షణా రహితంగా నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన కొబ్బరి కాయల వ్యాపారిపైకి కత్తి దూయడంతో ఆయన ప్రాణభయంతో పరుగులు తీశాడు. దీంతో అక్కడ నుండి నిందితుడు పరారీ అయ్యాడు. సంఘటనా ప్రాంతాన్ని సిఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. ఈ సంఘటనపై సిఐ మాట్లాడుతూ అన్నదమ్ముల మధ్య ఇల్లు, ఖాళీ ఆస్తుల తగాదా ఉందని, ఈ నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని అన్నారు. ఇద్దరి మధ్య ఆస్తి తగాదా అంశం కోర్టులో ఉందన్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - అన్నవరం

తొండంగి మండలం ఒంటిమామిడి సెంటర్లో బైక్‌పై వెళ్తు ఒక యువకుడు ఆదివారం లారీ ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్క డికక్కడే మృతి చెందాడు. గొరసపాలెంకు చెందిన నేమాల ఉప్పారావు(40) తన స్వగ్రామం నుంచి బైక్‌పై తొండంగి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో వెళ్తున్న లారీని వెనుక నుండి ఢీ కొంటాడు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల లాకుల వద్ద ప్రధాన కాలువలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాలు ఇవి.. చొప్పెల్ల లాకులు దాటిన తర్వాత కాలువలో సుమారు 40- 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్ఓ ఉదయ్‌కుమార్‌కు సమాచారం వచ్చిందన్నారు. దీనిపై వీఆర్ఓ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారన్నారు. పోలీసులకు కాలువలో లభ్యమైన మహిళ మృతదేహం ఎత్తు సుమారు ఐదు అడుగుల రెండు అంగుళాలు ఉంటుందన్నారు. ఆమె మరణానికి గల కారణాలతో పాటుగా ఊరు, పేరు, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కరపోతు లక్ష్మీప్రవీణ్ అజయ్(22) తాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గత నెల 25 తేదీ ఉదయం తాపీ పనికి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం సమయంలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతనిని 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన తిరుమలయపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,500, 9 బైకులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరం నిర్వహిస్తున్న రాయి సూరిబాబుని అదుపులోకి తీసుకుని విచారించగా మరికొంతమంది శిబిరం నుంచి పరారైనట్లు తెలిపారు. వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక ఇంటి సరిహద్దు వివాదంలో జరిగిన ఘర్షణపై ఒక వ్యక్తిని గాయపరిచిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వారి వివరాలు ప్రకారం.. ఉచ్చిలి గ్రామానికి చెందిన చిట్టి మేను వెంకటేష్ మేకలు మేపుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. ఈనెల 3న తన ఇంటి పక్కన ఉన్న వరుసకు బంధువైన చిట్టి మేను రామకృష్ణ, అతని తల్లి ఇంటి సరిహద్దు వివాదంలో వెంకటేష్‌ను కర్రతో కొట్టి గాయ పరిచారు. వెంకటేష్ కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

9 వరకూ మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రయివేటు మద్యం షాపులకు ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్ ఛార్జ్ ఎల్ లోవరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన మరియు ఐ.పోలవరం మండలాల పరిధిలో మొత్తం 13 మద్యం షాపులకు దరఖాస్తులను ఈ నెల 9 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. దరఖాస్తులను ఈ నెల 11న కలెక్టరేట్ కార్యాలయం నందు గోదావరి భవన్ లో దరఖాస్తు దారుల సమక్షంలో లాటరీ తీస్తారని ఆయన అన్నారు.

సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తితో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

దసరా సందర్భంగా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఎక్కువ డిమాండ్ ఉండడంతో అధిక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవి డిపోల నుంచి ఎన్ని బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఏ విధమైన ఛార్జీలు వసూలు చేస్తారనే తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

హైదరాబాద్‌కు ఏయే తేదీల్లో బస్సులు వెళతాయి.?

కాకినాడ జిల్లాలో మూడు డిపోల పరిధిలో 288 ఆర్‌టిసి సర్వీసులు నడుస్తున్నాయి. ఈ దసరాకు ప్రత్యేకంగా 140 బస్సులను రెండు వైపులా తిప్పుతున్నాము. ఈనెల 8న కాకినాడ డిపో నుంచి 2 బస్సులు, తుని, ఏలేశ్వరం డిపోల నుంచి ఒక్కో బస్సు, 9న కాకినాడ, ఏలేశ్వరం నుంచి 3 చొప్పున, తుని నుంచి 2, ఏలేశ్వరం నుంచి 3, 10వ తేదిన కాకినాడ నుంచి 7, తుని నుంచి 3, ఏలేశ్వరం నుంచి 4, 11న కాకినాడ నుంచి 6, తుని, ఏలేశ్వరం నుంచి 5 చొప్పున తిరుగుతాయి.

ఇతర ప్రాంతాలకు సర్వీసులు ఎలా నడుస్తాయి.?

కాకినాడ, తుని, ఏలేశ్వరం ఆర్‌టిసి డిపోల పరిధిలో హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ, శ్రీశైలం వంటి ముఖ్య ప్రాంతాలకు బస్సులు నడపనున్నాము. ఈనెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌కు 42, విజయవాడకు 20, విశాఖకు 20 చొప్పున ఏర్పాటు చేశాం. బెంగళూరుకు ఒక ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నాం. వీటిలో సూపర్ లగ్జరీ 23, అల్ట్రా డీలక్స్ 14, ఎక్స్ ప్రెస్ సర్వీసులు 4 ఉన్నాయి. రద్దీకి అనుగుణంగా విజయవాడ, విశాఖపట్నం వరకు అదనపు సర్వీసులు నడుపుతాము.

ఛార్జీలను ఏమైనా పెంచారా.?

ఆయా మార్గాల్లో నడిచే బస్సుల ఛార్జీలనే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ వసూలు చేస్తాం. రాకపోకలకు కలిపి ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10 శాతం రాయితీ ఉంటుంది. ఇప్పటికే రిజర్వేషన్ బుకింగ్ జరుగు తున్నాయి. ఈ ప్రత్యేక బస్సులు ఆయా డిపోల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఛార్జీల వివరాలు తెలియజేయండి.?

కాకినాడ నుంచి వయా రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కి సూపర్ లగ్జరీ బస్సుకి రూ.778, కాకినాడ నుంచి వయా రావులపాలెం విజయవాడ మీదుగా హైదరాబాద్ రూ.809, కాకినాడ నుంచి వయా రాజమహేంద్రవరం విజయవాడ మీదుగా హైదరాబాద్ రూ.806 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాకినాడ నుంచి హైదరాబాద్‌కు అమరావతి బస్సుకి రూ.1238, వెన్నెల 1442, స్టార్ లైనర్ రూ.1048, నైట్ రైడర్ రూ.1103 ఛార్జీలను వసూలు చేస్తున్నాం.

యానాం వార్తలు

కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థులు

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం రూరల్

మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి నేతృత్వంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మదర్ థెరిసా సర్కిల్ కళాశాల, బీఐటి విద్యార్థినులను బలాండ్ నెంబర్ 3, మడ అడవులకు బోటు మార్గంలో తీసుకెళ్లి పర్యావరణ పరిరక్షించే అంశంతో పాటు, సమాజంలో ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసి లెమన్ స్పూన్ రేస్, మ్యూజికల్ ఛైర్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, మురళీధరన్, కొఅర్డినేటర్ ఎ.రిప్కా రోసెలిన్, కె సత్యనారాయణ, కనకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోటలో స్వచ్ఛ రైలు బండ్లు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వచ్ఛ రైలుబండ్లు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వెయిటింగ్ హాల్స్ ను ప్రక్షాళన చేశారు.

వందేభారత్ రైలును క్లీన్ చేస్తున్న సిబ్బంది

12840 మెయిల్ ఎక్స్‌ప్రెస్,13351 బొకారో ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికులకు చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయమని కోరడం, రైలు ప్రయాణికులకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించడం, రైళ్లను పరిశుభ్రంగా ఉంచాలని ప్రోత్సహించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఛీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.గిరి, టికెట్ చెకింగ్ సిబ్బంది, ఆర్‌పిఎఫ్ సిబ్బంది, సఫాయివాల సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమోహన్‌కు మహాత్మా గాంధీ జాతీయ అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ

మనం ఫౌండేషన్ చే ప్రతి సంవత్సరం సామాజిక సేవా రంగంలో ఇస్తున్న మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డుకు కాకినాడకు చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ ఎంపిక య్యారు. శనివారం హైదరాబాద్ లోని సిటీ కల్చరల్ సెంటర్ లో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు, సామాజిక సేవలు చేసే అతిరథ మహారథుల సమక్షంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా ఆ అవార్డును కృష్ణమోహన్ అందుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింతగా సామాజిక

అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్

సేవ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణమోహన్ ఈ అవార్డుకి ఎంపిక అవ్వడం పట్ల ఆప్ నాయకులు, స్నేహితులు నరాల శివ, శ్రీనివాస్‌రాజు, పి.సుబ్రహ్మణ్యం, కనకదుర్గ, రియాజ్, పి.లక్ష్మణాచార్యులు, జానకీ రామయ్య హర్షం వ్యక్తం చేశారు.

పిఎం స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - సామర్లకోట

9,10 తరగతి విద్యార్థులకు అందించే పిఎం యశస్వీ పథకానికి బీసీ, ఇబిసి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సామర్లకోట ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.75 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారన్నారు. ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఇస్తారని, ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. పట్టణంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలకు మించరాదన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ yet.nta.ac.inలో చూడాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏర్పాటైన నూతన కార్యవర్గం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గద్దం సురేష్, గౌరవ అధ్యక్షులు కాజా బాబు ఆధ్వర్యంలో అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా అన్ని మండలాల నుంచి ప్రస్తుత సెక్రటరీలు, అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అత్యధికంగా హాజరై కొత్త యూనియన్ ఎన్నుకున్నారు.కొత్త యూనియన్ సభ్యులు అధ్యక్షులు కట్టమూరు కృష్ణ, గౌరవ సలహాదారుడు గురు, దీప్తి మోహన్, ప్రెసిడెంట్ చెల్లుబోయిన రమేష్, వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్, సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్, ట్రెజరీ కోటి, జాయింట్ ట్రెజరీ శివకృష్ణ, కార్యవర్గ సభ్యులు బాలాజీ, నతీష్, గోపి సుదర్శన్, రాధాకృష్ణ, హేమ్ చరణ్, శేఖర్, టిఆర్‌కె.కుమార్, పి.శ్రీనివాస్, కె.సీతారాం, రాజేష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చెల్లుబోయిన రమేష్ మాట్లాడుతూ అన్ని మండలాల యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ల సహకారం తీసుకుంటాం, మా యూనియన్ ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తానని అన్నారు.

జాతీయ హ్యాండ్ బాల్ జట్టుకు ప్రణీత్ ఎంపిక

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ జట్టులో ఆత్రేయపురం చెందిన ముదునూరి ప్రణీత్ వర్మకు స్థానం లభించింది. సిబిఎస్ఇ సౌత్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్) రాష్ట్రాలు పాల్గొన్న హ్యాండ్ బాల్ పోటీలలో అండర్ 19 విభాగంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ తరఫున ముదునూరి ప్రణీత్ వర్మ తో కలిసి ఆడిన జట్టుకు ప్రథమ స్థానం లభించింది. హైదరాబాద్ లో మరియు ది క్రాక్ ప్లానెట్ స్కూల్ మియాపూర్ లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 1 వరకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన హ్యాండ్ బాల్ జట్టు జాతీయ స్థాయిలో నేటి నుండి అక్టోబర్ 10 వరకు నాలుగు రోజులపాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా మోడీనగర్ లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రకాష్ నగర్ విద్యానికేతన్ లో ఇంటర్ చదువుతూ హ్యాండ్ బాల్ జాతీయ జట్టులో స్థానం పొందిన ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి ప్రణీత్ వర్మను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మండుతున్న ఎండలు

36 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాకాలం మొదలైన ఎండాకాలాన్ని తలపిస్తున్నట్టు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రతిరోజు 36 డిగ్రీలు పైగా ఉష్ణోగ్రతలు నమోదవటంతో సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. వర్షాకాలంలో 29–30 డిగ్రీలు ఉండే ఉష్ణోగ్రతలు ఒకేసారి 35 -36 డిగ్రీలు నమోదవడంతోపాటు ఉక్క పోత మరింత అధికమైంది. దీంతో వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రెయిన్ రోడ్లన్నీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్మానుష్యంగా తయారవుతున్నాయి.

ఉక్కపోతలకు అప్రమత్తంగా ఉండాలి

ఉష్ణోగ్రతలు పెరిగి వేసవిని తలపించడంతోపాటు వాతావరణంలో మార్పుల వల్ల చెమటలు అధికంగా పడుతున్నాయని, దీనివల్ల ఒంట్లో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ వచ్చే అవకాశం

నిర్మానుష్యంగా మారిన రహదారి

ఉందని దీనికి మంచినీరు ఓఆర్ఎస్ ద్రావణం అధికంగా సేవించాలని ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు

శివరత్నంకు అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

హెచ్ఎం శివరత్నంకు గురు బ్రహ్మ అవార్డు

ప్రజాశక్తి-కొత్తపేట

మండలంలోని కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయు శివరత్నంకు రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ స్పెషల్ విద్యారంగం పత్రిక వారు ' గురు బ్రహ్మ అవార్డు' ప్రదానంచేశారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి కె వాసుదేవరావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి చేతులు మీదుగా మెమెంటో అందజేసి సత్కరించారని కరస్పాండెంట్ రామోజు అనురాధ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బంధువులు సత్యనారాయణ, శంకర్, రాజు, కిరణ్, సత్తిబాబు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న పారిశ్రామిక వేత్త పాపారావు

బాధితునికి రూ.15 వేల సాయం

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని పెదపళ్ళకు చెందిన ఏడిద రవికుమార్ అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి గ్రామ పెద్దల ద్వారా విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త, శ్రీమారెళ్ళక్ష్మ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు పాపారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు నెక్కంటి బుజ్జి గ్రామ పెద్దల సమక్షంలో ఏడిద రవికుమార్ కుటుంబ సభ్యులకు చికిత్స నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధరతో బెంబేలు

కిలో రూ.50 నుంచి రూ.80

ప్రజాశక్తి -మామిడికుదురు

ఉల్లి చేసే మేలు తల్లి చేయలేదంటారు ఉల్లి వాడకం లేనిదే ఏ కూర వండటం సాధ్యం కాదు ఉల్లి వాడకం అధికం అందుకేనేమో ఉల్లి ధర మళ్లీ ఘాటు ఎక్కిస్తుంది. కిలో 30 నుంచి 40 మధ్య ఉండేది ప్రస్తుతం మార్కెట్లో ఆయా రకాలు నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.80 లోపు ధర పలుకుతోంది

అధిక వర్షాలతో తగ్గిన దిగుబడి.

మన రాష్ట్రంలో నెల్లూరు పరిసర ప్రాంతాలలో అధికంగా ఉల్లి పంట పండిస్తారు ఉల్లి పండించే వారు ఎక్కువ కావడం, ఉల్లి పంటలు రైతుల చేతికొచ్చే సమయానికి వరదలకు నష్టం వాటిల్లింది మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ఉల్లి దిగుమతి జరుగుతోంది మన జిల్లాలో జాతీయ రహదారిపై రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వరకు వివిధ చోట్ల ఉల్లి మార్కెట్లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు రెండు నెలల్లోనే ఉల్లి ధర రెట్టింపు అవ్వటం తో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విజయదశమి, దీపావళి, కార్తీకమాసం వరస పండుగలు, ముహూర్తాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉల్లి వాడకం అధికంగా ఉంటుంది పండుగల నేపథ్యంలో వాడకం ఎక్కువ అవ్వటంతో మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

పావు కిలోతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి

ప్రస్తుతం మార్కెట్లో ఉల్లిపాయల కొనాలంటే సాధారణ కుటుంబాలకు అందుబాటులో లేని ధరలు ఉన్నాయి. పేద, ధనిక తేడా లేకుండా వంటకాలలో ఉల్లిని వాడతారు ఇటీవల వ్యాపారులు రోజుకొక రేటుతో ఉల్లి ధర పెంచుతూ సొమ్ముచేస్తున్నారు. కారణం అడిగితే మార్కెట్లో కొరత ఏర్పడిందని చెబుతున్నారు పెట్టుబడి పెట్టలేక కేజీ కొందామని వెళ్తే పావు కేజీతో సరి పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది

ఉల్లి కొరత తీర్చండి

ఉల్లిపాయ మార్కెట్ ధరలు రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నాయి. ఉల్లి కొరతలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు నాణ్యతకు తగ్గ నిల్వ కు పనికిరాని ఉల్లిపాయలు విక్రయిస్తున్నారు. హోటల్ నిర్వహించడం కష్టంగా ఉంది ఇకనైనా ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉల్లి ధర తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

- మేడేపల్లి వెంకట సత్యనారాయణ, హోటల్ నిర్వాహకుడు, అప్పనపల్లి

గోతులమయంగా రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఆర్అండ్ బి రహదారి గోతులు మయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కపిలేశ్వరపురం నుండి పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. వర్షాలు కురిసే సందర్భాల్లో గోతుల్లో కి నీరు చేరడంతో రహదారి కనపడక వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మీదుగా భారీ వాహనాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో రహదారిపై వెళ్లాలంటే ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన నేటికీ రహదారి సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి నిత్యం రద్దీగా ఉండే రహదారిని ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రమాదాలు బారిన పడకుండావెంటనే మెరుగుపరచాలని లేదా అధ్వానంగా ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు ప్రయాణికులు విద్యార్థులు కోరుతున్నారు .

అప్పన కుటుంబానికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-మామిడికుదురు

పితృ వియోగానికి ఉన్న మామిడి కుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ కుటుంబాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. శ్రీరామకృష్ణ తండ్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పన నరసింహారావు ఇటీవల గుండెపోటుతో మతి చెందారు. ఆయన కుమారుడు మామిడి కుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అప్పన శ్రీ రామకృష్ణ మరియు సోదరులను కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం పట్టణ అధ్యక్షులు

పరామర్శిస్తున్న పిసిసి ఉపాధ్యక్షుడు కొత్తూరి తదితరులు

వంటెద్దు బాబి, జెడ్‌పిటిసి సభ్యులు కసిరెడ్డి అంజిబాబు, ఎపిసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ కుడుపూడి శ్రీనివాస్, అమలాపురం పట్టణ కార్యదర్శి ముత్తేటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 341/2006

Between:

బోను కనకం -వాది

AND

బోను సోమలు (died) వగైరాలు -ప్రతివాదు

75 ప్రతివాది: కంచుకోట జయ, W/o. రవి, 52 సం॥, డోర్ నెం. 44-10-15/1, అన్నపూర్ణమ్మపేట, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 75వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు పై కోర్టు వారి నుండి మరియు పోస్టల్ నుండి సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున ది. 14-10-2024 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు అయ్యి మీ అభ్యంతరాలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం
అడ్వకేటు, అనపర్తి
రామచంద్రపురం
05-10-2024 సెల్: 9912946959

LOST OF PASSPORT

I, Sai Krishna Thota, S/o Vishnumurthy Thota resident of Veeravaram Village, lost my original passport No. G0819456 issued by passport office Vishakapatnam, dated 21-12-2006, while I was shifting household goods and documents between Veeravaram village and Kakinada. Insite of my best efforts I, could not trace out its whereabouts. If anybody finds my original passport please intimate the same.

SAI KRISHNA THOTA
Veeravaram, CELL: 89197 22566
Date.

నోటీసు

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. 130/2023
O.S. 447/2017

Between:

పోతుల కృష్ణమూర్తి -వాది

AND

1. దున్నా మోహనరావు వగైరా -ప్రతివాదులు

2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది: శ్రీమతి దున్నా అనిత, భర్త: దున్నా కామేశ్వరరావు అనే నాని, డోర్ నెంబర్ 5-87, శీల అంక గ్రామము, కాజులూరు మండలం

పై నెంబర్ పిటిషన్‌లో మిమ్మలను దావాలో రెండవ ప్రతివాదిగా చేర్చించమని మీపై కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక EVADE చేసినందున, నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఇవ్వమని శ్రీ కోర్టు వారు ఆర్డరు ఇచ్చియున్నారు. ది. 14-10-2024 తేదీన వాయిదా వున్నది. మీరు వాయిదా రోజు ది 14-10-2024 తేదీన మీరు స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10-30 ని॥ లకు పై కోర్టునందు హాజరై మీయొక్క అభ్యంతరములు ఏమైన యెడల మనవి చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా పిటిషను విచారణ జరపబడును.
శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

ఉప్పులూరి రామారావు, అడ్వకేట్
63-3-4బి, ఉప్పులూరివారి వీధి
కాకినాడ కాకినాడ- 533003
ది.1-10-2024 సెల్: 9949045514